
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 నేడు మహాత్ముని జయంతి

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

బుధవారం 2 అక్టోబరు 2024

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, అక్టోబరు 1: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు మంగళవారం ప్రకటించారు. ఈ నెల ఆరో తేదీ వరకు కనిష్ఠంగా 4 మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 10 మిల్లీ లీటర్లు వర్షపాతం నమోదవుతుందని ఆయన పేర్కొన్నారు.



జిల్లాలోని మారేడుమిల్లిలో మహిళకు పెన్షన్ సొమ్ము అందిస్తున్న కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్

జిల్లాలో 95.76 శాతం పెన్షన్ల పంపిణీ

మొత్తం లబ్ధిదారులు 1,24,778 మంది

- 1,19,482 మందికి అందజేత
- కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కూటమి నేతలు

పాడేరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో తొలి రోజైన మంగళవారం 95.76 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో మొత్తం 1,24,778 మంది పెన్షన్ లబ్ధిదారులకు గాను తొలి రోజు రాత్రి 8 గంటల వరకు 1,19,482 మందికి రూ.49 కోట్ల 73 లక్షల 76 వేల 500 పెన్షన్ సొమ్ము అందజేశారు. ఇంకా 5,296 మందికి పెన్షన్ అందించాల్సి ఉంది. దీంతో జిల్లాలో తొలి రోజు పెన్షన్ల పంపిణీ 95.76 శాతంగా నమోదైంది. తొలి రోజు పెన్షన్ పొందని లబ్ధిదారులకు బుధవారం అందజేస్తామని అధికారులు తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ విమురళి కాల్ సెంటర్ ద్వారా జిల్లాలో పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించి, కార్యక్రమం విజయవంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.

మారేడుమిల్లిలో కలెక్టర్ పంపిణీ

కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ రంపచోడవరం డివిజన్ మారేడుమిల్లి గ్రామంలో మంగళవారం పలువురు మహిళలకు పెన్షన్ సొమ్మును అందించి జిల్లాలో పెన్షన్ల పంపిణీ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ కేంద్రంలో టీడీపీ అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ పలువురికి పెన్షన్ పంపిణీ చేశారు. టీడీపీ పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పాడేరు మండలం లగిశపల్లిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ తమ ప్రాంతాల్లోని పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సొంతగూటికి ఏకలవ్య

నేడు పెదబయలు, అరకులోయ స్కూళ్ల భవనాలను వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

- అనంతగిరి, హుకుంపేటలోని భవన నిర్మాణాలకూ శంకుస్థాపన




పెదబయలులో నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఆదివాసీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించే ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ పెదబయలు, అరకులోయలో బుధవారం ప్రారంభంకానున్నాయి. ఈ పాఠశాలల భవనాలను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. అలాగే అనంతగిరి, హుకుంపేటలో రూ.40 కోట్లతో నిర్మించే రెండు భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటి వరకు పరాయి పంచన ఉన్న ఈ పాఠశాలలు సొంత భవనాల్లోకి వెళ్లనున్నాయి. అత్యాధునిక వసతులతో నిర్మించిన పెదబయలు, అరకులోయ పాఠశాలల భవనాల్లోకి విద్యార్థులు అడుగుపెట్టనున్నారు.

గిరిజన ప్రాంతంలో ఆదివాసీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, కళాశాల ద్వారా మాత్రమే ఆశ్రమ విద్యను అందిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం నుంచి మరింత మెరుగైన కార్పొరేట్ స్థాయి విద్యను ఆదివాసీ విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో కేంద్రం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లను స్థాపించాలని 2010లో నిర్ణయించింది. ఇందులో భాగంగా ఏజెన్సీలో తొలిసారిగా జీకేవీధి మండలంలో 2011లో ఏకలవ్య స్కూల్‌ను ఏర్పాటు చేసింది. ఆ తరువాత 2018- 19 విద్యా సంవత్సరంలో చింతపల్లిలో, 2020- 21 విద్యా సంవత్సరంలో ఏజెన్సీలోని మిగిలిన పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచంగిపుట్టు, అరకులోయ, జి.మాడుగుల, అనంతగిరి, కొయ్యూరు మండలాలకు ఏకలవ్య స్కూళ్లను మంజూరు చేశారు. విశేషం ఏమిటంటే రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 28 ఏకలవ్య స్కూళ్లు ఉంటే అందులో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 17, పాడేరు డివిజన్ పరిధిలో 11 ఉన్నాయి. ప్రస్తుతం ముంచంగిపుట్టు, పెదబయలు పాఠశాలలు పెదబయలులో, కొయ్యూరు, చింతపల్లి పాఠశాలలు చింతపల్లిలో, పాడేరు, హుకుంపేట పాఠశాలలు పాడేరులో, అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ పాఠశాలలు అరకులోయలో, జీకేవీధి, జి.మాడుగుల పాఠశాలలు ఆయా మండలాల్లోనే నడుస్తున్నాయి. అయితే చింతపల్లి, జీకేవీధి స్కూళ్లకు మాత్రమే సొంత భవనాలున్నాయి. పాడేరు, కొయ్యూరు, డుంబ్రిగుడ , జి.మాడుగుల, ముంచంగిపుట్టు స్కూళ్ల భవన నిర్మాణాలు జరుగుతుండగా, పెదబయలు, అరకులోయ పాఠశాలల భవనాలను బుధవారం ప్రధాని మోదీ ఝార్ఖండ్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అలాగే హుకుంపేట, అనంతగిరి స్కూళ్ల భవనాలకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు.



అరకులోయలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ భవనం

కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో విద్యా బోధన

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఆదివాసీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో ఆశ్రమ విద్యను అందిస్తారు. జిల్లాలో పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రతి మండలంలో ఒక పాఠశాల ఉన్నది. ఏకలవ్యలో కో-ఎడ్యుకేషన్, ఆంగ్ల మాధ్యమం, సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన జరుగుతున్నది. అలాగే ఆరో తరగతిలో ప్రవేశం పొందిన బాల బాలికలు ఇంటర్ వరకు ఉచిత విద్యను పొందుతారు. ప్రతి తరగతిలో 60 సీట్లు ఉండగా వాటిలో 30 సీట్లు బాలికలు, మరో 30 సీట్లు బాలురకు కేటాయిస్తారు. ఒక్కొక్క పాఠశాలలో ఆరో తరగతిలో 60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సీట్లలో 48 సీట్లు గిరిజన బాలబాలికలకు కేటాయించారు. పీవీటీజీలకు 3, దివ్యాంగులు, సంచార కుటుంబాల పిల్లలకు 3, తీవ్రవాద దాడులు, కొవిడ్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలలకు ఆరు సీట్లు కేటాయించారు. ఈ ఆరు సీట్లు ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ కులాల విద్యార్థులకు కేటాయించారు. విద్యార్థులకు అత్యాధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు తరగతి గదుల్లో వ్యక్తిగత కుర్చీలు, వసతి గదుల్లో బంకర్ బెడ్స్ ఉంటాయి. అలాగే శాశ్వత భవనాలు అందుబాటు ఉన్న పాఠశాలల్లో నలుగురు విద్యార్థులకు ఒక గది చొప్పున కేటాయించారు. సువిశాలమైన తరగతి గదులు, క్రీడామైదానం అందుబాటులో ఉన్నాయి. నాణ్యమైన పోషకాహారం కలిగిన మెనూ అమలు చేస్తున్నారు. పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం, బెడ్‌షీట్, రగ్గులు, ప్లేట్, గ్లాస్, షూ, టై, పెట్టె ఉచితంగా అందజేస్తారు. బాలబాలికలకు రక్షణగా మూడు నుంచి ఐదుగురు సెక్యూరిటీ గార్డులున్నారు. దీంతో ఏకలవ్య మోడల్ స్కూళ్లలో ఆదివాసీ విద్యార్థులకు చక్కని క్రమశిక్షణతో కూడిన కార్పొరేట్ స్థాయి ఆశ్రమ విద్య అందుతున్నది. అందువల్లే ఏజెన్సీలో ప్రస్తుతం ఏకలవ్య స్కూళ్లలో ప్రవేశాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. కాగా పెదబయలు, అరకులోయలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు జార్ఖండ్ నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎం ఆదేశంతో దశాబ్దాల నాటి సమస్య పరిష్కారం

మంప పంచాయతీలోని నాలుగు గ్రామాల ప్రజలకు రేషన్ కష్టాలు

- ప్రతి నెలా నడక దారిన 12 కిలో మీటర్లు, లేదా రోడ్డు మార్గాన 50 కిలో మీటర్లు ప్రయాణించాల్సిన దుస్థితి
- అందుబాటులో సబ్ డిపో ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా ఫలితం శూన్యం
- ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లిన సీపీఐ నాయకులు
- వెంటనే స్పందించి ఒక్క రోజులోనే సబ్ డిపో ఏర్పాటు చేయించిన వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు



సబ్ డిపో ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబును కోరుతున్న సీపీఐ నాయకులు

కొయ్యూరు, అక్టోబరు 1: మంప పంచాయతీలోని నాలుగు గ్రామాల ప్రజల రేషన్ కష్టాలు ఎట్టకేలకు గట్టెక్కాయి. ఆయా గ్రామాల ప్రజల కష్టాలను సీపీఐ నాయకులు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి సబ్ డిపో ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ నాలుగు గ్రామాలకు అందుబాటులో ఉండేలా ఆర్.దొడ్డవరంలో మంగళవారం సబ్ డిపోను అధికారులు ఏర్పాటు చేశారు. దీనిపై ఆ గ్రామాల ప్రజలు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మంప పంచాయతీలోని పి.గంగవరం, టిటోరాళ్లు, ఆర్.దొడ్డవరం, గొడుగుల మ్మబంధ గ్రామాల్లో వంద కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు ప్రతి నెలా నడక దారిన 12 కిలోమీటర్లు, లేదా రోడ్డు మార్గాన యాభై కిలోమీటర్లు ప్రయాణించి డిపో ఉన్న మంప వచ్చి రేషన్ సరకులు తీసుకువెళ్లేవారు. తమ గ్రామాలకు అందుబాటులో సబ్ డిపోను ఏర్పాటు చేయాలని పలు మార్లు ఉన్నతాధికారులకు వారు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోయింది. కాగా సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సీపీఐ అగ్ర నేతలు రామకృష్ణ, జేవీ సత్యనారాయణమూర్తి, పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంప పంచాయతీలోని ఆ నాలుగు గ్రామాల ప్రజలు రేషన్ సరకుల కోసం పడుతున్న ఇబ్బందులను పొట్టిక సత్యనారాయణ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి ఆ నాలుగు గ్రామాలకు అందుబాటులో ఉండేలా సబ్ డిపో ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో ఆర్.దొడ్డవరంలో మంగళవారం సబ్ డిపోను అధికారులు ప్రారంభించారు. దశాబ్దాల కాలంగా ఉన్న డిపో సమస్య తీరడంతో గిరిజనులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



పాడేరు మెయిన్‌రోడ్డులో మంగళవారం ఉదయం ఏడు గంటలకు పొగమంచు

దట్టంగా పొగమంచు

మన్యంలో గత మూడు రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తున్నది. పాడేరుతో సహా పలు ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు దట్టంగా పొగమంచు కమ్ముకుంది. దీంతో వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాయి.

\- పాడేరు/ఆంధ్రజ్యోతి

ఘనంగా అంతర్జాతీయ కాఫీ దినోత్సవం



అంతర్జాతీయ కాఫీ డే వేడుకల్లో పాల్గొన్న కాఫీ బోర్డు అధికారులు, గిరిజన రైతులు

చింతపల్లిలోని కేంద్ర కాఫీ బోర్డు కార్యాలయంలో అంతర్జాతీయ కాఫీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకరరావు, ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టు ఏడీ అశోక్, కాఫీ బోర్డు విస్తరణ తనిఖీ అధికారులు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

\- వార్త 8వ పేజీలో

17 మంది మావోయిస్టు మిలీషియా సభ్యులు లొంగుబాటు



లొంగిపోయిన మిలీషియా సభ్యులతో ఎస్పీ అమిత్‌బర్దార్, చిత్రంలో ఏఎస్పీ ధీరజ్

పాడేరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఎదుట మంగళవారం 17 మంది మావోయిస్టు మిలీషియా సభ్యులు లొంగిపోయారు. పెదబయలు మండలం లండులు, ఇంజెరి, గిన్నెలకోట గ్రామాలకు చెందిన వీరంతా మావోయిస్టు పార్టీ పెదబయలు ఏరియా కమిటీలో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం, పోలీస్ శాఖ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ, స్వయం ఉపాధి కార్యక్రమాలకు ఆకర్షితులై మావోయిస్టు పార్టీతో సంబంధం ఉన్న అనేక మంది జనజీవన స్రవంతిలోకి వస్తున్నారన్నారు. వారికి పునరావాసం కల్పిస్తామని చెప్పా రు. అలాగే మిగిలిన మావోయిస్టులు కూడా వాస్తవాలను గ్రహించి జన జీవన స్రవంతిలోకి రావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కె.ధీరజ్, సీఆర్‌పీఎఫ్ (198) అసిస్టెంట్ కమాండెంట్ పి.చారియన్‌రాజు పాల్గొన్నారు.

కైలాసగిరిపై సాహస క్రీడలు

జిప్ లైనర్, స్కై సైక్లింగ్‌కు ఏర్పాట్లు

- ఇప్పటికే టవర్ల నిర్మాణం పూర్తి
- రెండు, మూడు రోజుల్లో ట్రయల్ రన్
- దసరా నుంచి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్న అధికారులు

\- 7లో



మాతాశిశు మరణాల నియంత్రణకు చర్యలు

బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన

- రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక కార్యాచరణ
- మహిళా శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి



చింతపల్లిలో పోషకాహార వంటకాల స్టాళ్లు ఏర్పాటు చేసిన కార్యకర్తలకు బహుమతులు అందజేస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

చింతపల్లి, అక్టోబరు 1:

గిరిజన ప్రాంతంలో మాతాశిశు మరణాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మహిళా, శిశు సంక్షేమశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో పోషకాహార మాసోత్సవం ముగింపు వేడుకలను ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చిన్మయిదేవి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఎక్కడా మాతాశిశు మరణాలు సంభవించకుండా క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి గర్భిణి ఆస్పత్రిలోనే ప్రసవం పొందేలా ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఇంట్లో ప్రసవం పొందడం వల్ల తల్లీబిడ్డకు ప్రమాదమని గర్భిణులను చైతన్యపరుస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతంలో బాల్య వివాహాల నియంత్రణకు ఐసీడీఎస్ అధికారులు అనుబంధశాఖల అధికారులను కలుపుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రధానంగా గిరిజన ప్రాంతంలో బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికల్లో రక్తహీనత సమస్య అధికంగా కనిపిస్తున్నదన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. రక్తహీనత కలిగిన మహిళలు ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలన్నారు. అనంతరం పోషకాలు కలిగిన రుచికరమైన వంటకాలను ప్రదర్శించిన అంగన్‌వాడీ కార్యకర్తలకు బహుమతులు అందజేశారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.ఆశాజ్యోతి, తహసీల్దార్ టి.రామకృష్ణ, సీడీపీవోలు జీవీ రమణ, పి.విజయకుమారి, ఏసీడీపీవో ఎం.రామలక్ష్మి, వైస్ ఎంపీపీ శారద, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యులు ధారలక్ష్మి పద్మ, జయలక్ష్మి, సూపర్‌వైజర్లు విజయకుమారి, గౌహర్ ఉన్నీష, సత్యవతి, గౌరి, అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.



కొయ్యూరులో సీడీపీవోకు సేవా పురస్కారాన్ని అందజేస్తున్న చిన్మయిదేవి

పలువురికి సేవా పురస్కారాలు

కొయ్యూరు: ప్రాజెక్టు పరిధిలో పోషకాహార మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు సీడీపీవో, సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బందితో పాటు 19 మంది అంగన్‌వాడీ వర్కర్లు, ఇద్దరు ఆయాలకు ఆర్‌జేడీ చిన్మయిదేవి ఉత్తమ సేవా పురస్కారాలను అందజేశారు. మంగళవారం కొయ్యూరులోని గిరిజన భవన్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్మయిదేవి మాట్లాడుతూ ఐసీడీఎస్ రీజియన్ పరిధిలోని ఆరు జిల్లాల్లో బాల్య వివాహాల నియంత్రణకు

... మిగతా 8వ పేజీలో

అంబులెన్స్‌లో ప్రసవం

- తల్లీ బిడ్డ క్షేమం

పాడేరురూరల్, అక్టోబరు 1: పెదబయలు- జి.మాడుగుల మండల సరిహద్దులో మంగళవారం 108 వాహనంలో నిండు గర్భిణి ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చిందని వాహన సిబ్బంది తిరుపతిరావు, యుగంధర్ తెలిపారు. పెదబయలు మండలం పోతులగరువు గ్రామానికి చెందిన వెలగ ఈశ్వరమ్మ(32) మంగళవారం మధ్యాహ్నం ప్రసవ వేదనకు గురికావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. ఆ గ్రామానికి సమీపంలో పాడేరు మండలం ఉండడంతో పాడేరుకు చెందిన 108 సిబ్బంది గ్రామానికి చేరుకొని గర్భిణిని జి.మాడుగుల పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికం కావడంతో నుర్మతి గ్రామ సమీపంలో వాహనాన్ని నిలిపి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) తిరుపతిరావు డెలివరీ చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండడంతో వారిని జి.మాడుగుల పీహెచ్‌సీకి తరలించి అక్కడ చేర్పించామని 108 సిబ్బంది తెలిపారు.

క్రైం... crime news

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1: పట్టణానికి ఆనుకుని ఉన్న సత్యనారాయణపురం రైల్వే అండర్ పాస్ సమీపంలో మంగళవారం గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ శాంతారామ్ తెలిపారు. ఇతనికి 35-40 సంవత్సరాల వయసు వుంటుందని, సుమారు 5.7 అడుగులు ఎత్తు ఉన్నాడన్నారు. తెలుపురంగు ఫుల్‌హ్యాండ్ షర్టు, బ్రౌన్‌కలర్ కట్ బనియన్ ధరించి ఉన్నాడని తెలిపారు. కుడి చేతికి పూసలతో కూడిన కాషాయరంగు తాడు ఉందని, సంఘటనా స్థలంలో ఇతర ఆధారాలు ఏమీ లభించలేదన్నారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శాంతారామ్ తెలిపారు.

బిడ్డతో సహా తల్లి అదృశ్యం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1 : పట్టణానికి ఆనుకుని ఉన్న కొత్తూరు పంచాయతీ దేవీనగర్‌కు చెందిన మహిళ తన కుమార్తెతో సహా అదృశ్యమైనట్టు మంగళవారం ఫిర్యాదు అందిందని పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. కాండ్రేగుల శివ సాయికుమార్ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య సౌజన్య సోమవారం సాయంత్రం శివ సాయికుమార్‌కు ఫోన్ చేసి, కుమార్తెతోసహా (4 ఏళ్లు) ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్టు చెప్పింది. దీంతో శివసాయికుమార్ హుటాహుటిని ఇంటికి వచ్చాడు. అప్పటికే భార్య, కుమార్తె వెళ్లిపోయారు. పలుచోట్ల వెతికినా జాడ కనిపించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

సింహాద్రి ఎన్టీపీసీలో కార్మికుడి మృతి

» అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


పడాల నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో)

పరవాడ, అక్టోబరు 1 : సింహాద్రి ఎన్టీపీసీలో మంగళవారం కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి సీఐ జి.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలపాక పంచాయతీ మూలస్వయంభూవరం గ్రామానికి చెందిన పడాల నాగేశ్వరరావు(55) సింహాద్రి ఎన్టీపీసీలోని సీహెచ్‌పీ-1లో మోనిసా ఎరెక్టర్స్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ తరఫున కొంతకాలం నుంచి కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం జనరల్ షిఫ్ట్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడడంతో తోటి కార్మికులు సీపీఆర్ చేసి ఎన్టీపీసీకి చెందిన ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కానీ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. నాగేశ్వరరావుకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని, మృతుడిఇ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. కాగా పడాల నాగేశ్వరరావు కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కోరారు.

నాలుగు ఇసుక లారీలు పట్టివేత


పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలు

నక్కపల్లి, అక్టోబరు 1: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు లారీలను మండలంలోని వేంపాడు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి అచ్యుతాపురానికి ఇసుక రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. లారీను పోలీసుస్టేషన్‌కు తరలించి అపరాధ రుసుము విధించినట్టు ఎస్ఐ కుమారస్వామి తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక


రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన బాలికలు

ఎస్.రాయవరం, అక్టోబరు 1: మండలంలోని పెదగుమ్మలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్-17 జిల్లాస్థాయి వాలీబాల్ బాలురు, బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. తొలుత ఈ పోటీలను టీడీపీ సీనియర్ నాయకులు వై.నవీన్‌రాజు, అల్లు నరసింహమూర్తి, ఆదర్శ విద్యా సంస్థల అధినేత సీతారామరాజు ప్రారంభించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 15 బాలురు, 15 బాలికల జట్లు పాల్గొన్నాయి. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరిని మాజీ ఎంపీపీ యేజర్ల వినోద్‌రాజు అభినందించారు. త్వరలో విజయనగరంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని పెదగుమ్మలూరు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని నిర్మల తెలిపారు.

బ్యాడ్మింటన్ ఛాంపియన్ ఎలమంచిలి ఎస్‌జీఏ డిగ్రీ కళాశాల



విజేతలతో ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి విజయ్‌మోహన్ తదితరులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 1: ఏయూ స్పోర్ట్సు బోర్డు నిర్వహించిన అంతర్ కళాశాలల పురుషులు, మహిళల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఎంవీపీ కాలనీ జీవీఎంసీ ఎస్ 3 స్పోర్ట్సు ఎరీనాలో జరిగిన ఈ టోర్నీ పురుషుల విభాగంలో ఎలమంచిలి ఎస్‌జీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ స్థానం సాధించగా, అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఏయూ కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. మహిళల కేటగిరీలో ఎలమంచిలి ఎస్‌జీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శృంగవరపు కోట, ఏయూ డాక్టర్ అంబేడ్కర్ లా కళాశాల తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ సమన్వయకర్త డాక్టర్ వై.పోలిరెడ్డి, డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వాసుదేవరాజు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

దుర్గమ్మ విగ్రహాలకు తుది మెరుగులు

శరన్నవరాత్రి ఉత్సవాలతో బొమ్మల తయారీ కళాకారులు బిజీ

» గొర్లివానిపాలెంలో భారీ ఎత్తున విగ్రహాలు తయారీ

» రూ.2 వేల నుంచి రూ.15 వేల వరకు అమ్మకం


విగ్రహాలకు రంగులు వేస్తున్న కళాకారుడు

పరవాడ, అక్టోబరు 1: శరన్నవరాత్రి ఉత్సవాలు రెండు రోజుల్లో ప్రారంభం కానుండడంతో దుర్గాదేవి విగ్రహాలకు తయారీదారులు తుది మెరుగులు దిద్దుతున్నారు. మండలంలోని గొర్లివానిపాలెంలో వినాయకుడు, దుర్గాదేవి, ఇతర దేవతామూర్తుల విగ్రహాలను ఆకట్టుకునేలా తయారు చేసే కళాకారులు వున్నారు. దీంతో మండలంలోని పలు గ్రామాలతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి కూడా భక్తులు ఇక్కడకు వచ్చి విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు సుమారు నెల రోజుల ముందే ఆర్డర్లు ఇచ్చి విగ్రహాలు తయారు చేయించుకుంటున్నారు. పెదగంట్యాడ, గాజువాక, అగనంపూడి, కూర్మన్నపాలెం, అచ్యుతాపురం నుంచి కూడా విగ్రహాల కోసం వస్తుంటారు. రెండు అడుగుల నుంచి ఏడున్నర అడుగుల వరకు విగ్రహాలను తయారు చేస్తున్నారు. విగ్రహాల పరిమాణాన్ని బట్టి రూ.2 వేల నుంచి రూ.15 వేల వరకు అమ్ముతున్నారు. విగ్రహాల తయారీదారుడైన అనకాపల్లి శివ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, ఐదేళ్ల నుంచి దుర్గాదేవి విగ్రహాలను తయారు చేస్తున్నట్టు చెప్పారు. దసరాకు రెండు నెలల ముందు విగ్రహాల తయారీ పనులు మొదలు పెడతామన్నారు. విగ్రహాల తయారీకి అవసరమైన ముడిసరకులను రాజస్థాన్, పుణె, హైద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. తనతోపాటు మరో పది మంది కళాకారులు విగ్రహాలను తయారు చేస్తుంటామని ఆయన చెప్పారు.


విక్రయానికి సిద్ధం చేసిన దుర్గాదేవి విగ్రహాలు

పూడిమడక మత్స్యకారులు హ్యాపీ!

» గేలాలకు చిక్కిన కచ్చిలి చేపలు

» పది రోజుల తరువాత సంతృప్తికరంగా వేట


రూ.30 వేలు పలికిన కచ్చిలి చేపలు


మత్స్యకారులు విక్రయిస్తున్న అభిలాష రకం చేపలు

అచ్యుతాపురం, అక్టోబరు 1: సుమారు వారం రోజుల తరువాత సముద్రంలో వేటకు వెళుతున్న పూడిమడక మత్స్యకారులకు భారీగానే చేపలు లభిస్తున్నాయి. గ్రామంలో సుమారు 700 బోట్లుండగా మంగళవారం ఉదయం సుమారు 300 బోట్లు చేపల వేటకు వెళ్లాయి. అన్ని గేలాలకు 'అభిలాష' అనే చేపలతోపాటు కచ్చిలి చేపలు కూడా చిక్కాయి. బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడుతున్న అల్పపీడనాల కారణంగా సెప్టెంబరు 21 నుంచి పూడిమడక మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లడం లేదు. వర్షాలు ఆగిపోవడం, వాతావరణం అనుకూలంగా మారడంతో ఆదివారం నుంచి చేపల వేటకు వెళుతున్నారు. రెండు రోజుపాటు ఆశాజనంగా వేట సాగలేదు. చిన్నపాటి చేపలు పడడంతో నిరాశ చెందారు. అయితే మంగళవారం వేటకు వెళ్లిన అన్ని బోట్లకు చేపలు పడ్డాయి. అందరికీ 'అభిలాష' రకం చేపలు పడడం విశేషం. ఒక్కొక్క బోటుకు పది చేపలు వరకు చిక్కాయి. వ్యాపారులు కిలో వంద రూపాయల చొప్పున కొనుగోలు చేశారు. ఒక మత్స్యకారుని గేలాలకు నాలుగు కచ్చిలి/బంగారు పాప చేపలు పడ్డాయి. వ్యాపారులు వీటిని రూ.30 వేలకు కొనుగోలు చేశారు.

సైద్ధాంతిక మానవతావాది ఏచూరి

సంస్మరణ సభలో కొనియాడిన వక్తలు


సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కొణతాల రామకృష్ణ. పక్కన దాడి వీరభద్రరావు, పీలా గోవింద, లోకనాథం తదితరులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 1: సైద్ధాంతిక విలువలు పాటిస్తూనే ఇతర రాజకీయ పార్టీల నాయకులతో సత్సంబంధాలు నెరపిన మానవతావాది సీతారాం ఏచూరి అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన వాదనలు ఇతర పార్టీలు కూడా కాదనలేనంత సహేతుకంగా ఉండేవన్నారు. దివంగత సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ మంగళవారం ఇక్కడ పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. ఏచూరి చిత్రపటానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పూలమాల వేయగా, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ, యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు, అనేక ప్రజా అనుకూల చట్టాలు రావడం వెనుక ఏచూరి కృషి ఉందన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం, విశాఖ రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటాలకు సహకరించారని గుర్తు చేశారు. విశాఖపట్నంలో సీతారాం ఏచూరి విగ్రహం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ, సీతారాం ఏచూరి దేశ రాజకీయాల్లో ముఖ్య పాత్ర నిర్వహించారన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ ఏచూరి వంటి మహానాయకులను నేటి తరం రాజకీయ నేతలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా చట్టసభల్లో, బయట ఏచూరి నిరంతరం పోరాడారని అన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా తుది శ్వాస విడిచే వరకు పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మీసాల సుబ్బన్న, టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, ఇతర పార్టీలకు చెందిన జి.కోటేశ్వరరావు, రాజాన దొరబాబు, కె.హరిబాబు, వైఎన్ భద్రం, అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎన్ కుమార్, యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భరిణికాన సాయినాథరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల ఆందోళన


వర్క్సు ఈడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. వర్క్సు ఈడీ కార్యాలయాన్ని ముట్టడించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సీఐఎస్ఎఫ్ సిబ్బందితో పాటు పోలీసులు భారీగా మోహరించారు. ప్లాంటులో సుమారు 14 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉండగా వారిలో నాలుగు వేల మందిని ఆపేయాలని యాజమాన్యం గత శనివారం నిర్ణయించింది. ఈ మేరకు వారి వివరాలను బయోమెట్రిక్ యంత్రాల నుంచి తొలగించింది. దాంతో కార్మికులు ఆదివారం పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధమయ్యారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి వెంటనే తొలగించకుండా చర్యలు చేపట్టింది. కార్మికులు శాంతించారు. అయితే కాంట్రాక్టు కార్మికులకు మూడు నెలలకొకసారి పసుపు రంగు కార్డులు (గేట్ పాస్) ఇస్తారు. తొలగించాలని నిర్ణయించిన వారి నుంచి ఆ కార్డులను వెనక్కి తీసుకున్నారు. వాటి స్థానంలో కొత్తగా తెలుపు కార్డులు ఇవ్వాలని భావిస్తున్నారు. వాటిని రెన్యువల్ చేయకుండా కొద్దికాలం తరువాత వారిని పూర్తిగా నిలిపివేయాలని యాజమాన్యం భావిస్తోంది. ఈ విషయం బయటకు పొక్కడంతో మంగళవారం కాంట్రాక్టు కార్మికులు కుటుంబాలతో సహా వచ్చి వర్క్సు ఈడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఇది రాత్రి వరకు కొనసాగింది. ఏ ఒక్కరిని తొలగించినా ఊరుకోబోమని, అందరినీ కొనసాగించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.14 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం వస్తుంది. వీరిలో స్టీల్‌ప్లాంటు నిర్మాణానికి భూములు ఇచ్చిన నిర్వాసితులు కూడా ఉన్నారు.

కైలాసగిరిపై సాహస క్రీడలు

జిప్ లైనర్, స్కై సైక్లింగ్‌కు ఏర్పాట్లు

» ఇప్పటికే టవర్ల నిర్మాణం పూర్తి

» రెండు, మూడు రోజుల్లో ట్రయల్ రన్

» దసరా నుంచి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్న అధికారులు


స్కై సైక్లింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) పర్యాటకులకు దసరా కానుక సిద్ధం చేస్తోంది. కైలాసగిరిపై అడ్వంచర్ స్పోర్ట్స్‌లో భాగంగా స్కై సైక్లింగ్, జిప్ లైనర్లను ఏర్పాటు చేస్తోంది. రెండేళ్ల క్రితమే వీటికి సంబంధించి అవగాహన ఒప్పందం కుదిరినా పనులు ముందుకుసాగలేదు. ఇటీవల కమిషనర్‌గా వచ్చిన విశ్వనాథన్ పాత వాటిని సమీక్షించి, ఆయా పనులు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టారు. దాంతో ఈ రెండింటి పనులు ఊపందుకున్నాయి. వీటి కోసం వీఎంఆర్‌డీఏ రూపాయి కూడా పెట్టుబడి పెట్టడం లేదు. కేవలం కొండపై రెండు వేల గజాల స్థలం మాత్రమే కేటాయించింది. కేరళలో జిప్ లైనర్, స్కై సైక్లింగ్ ప్రాజెక్టులను విజయవంతంగా నిర్వహిస్తున్న ఓ సంస్థ, విశాఖపట్నానికి చెందిన సాయి మోక్ష షిప్పింగ్ ఏజెన్సీ కలిసి జాయింట్ వెంచర్ కింద ఈ ప్రాజెక్టు చేపట్టాయి. వ్యయం అంతా అవే భరిస్తాయి. అందులో వచ్చే ఆదాయంలో 45 శాతం వీఎంఆర్‌డీఏకు ఇస్తాయి. కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహం వద్ద నుంచి విశాలాక్షి నగర్ వైపు 150 మీటర్ల పొడవున ఈ జిప్ లైనర్, స్కై సైక్లింగ్ వస్తాయి. అలాగే స్కై సైక్లింగ్ అందుబాటులోకి రానున్నది.

టికెట్ ధరపై నిర్ణయం కమిషనర్‌దే

ఈ తరహా జిప్ లైనర్లు, స్కై సైక్లింగ్‌లకు కేరళలో మనిషికి రూ.150 చొప్పున టికెట్ పెట్టి వసూలు చేస్తున్నారు. ఇక్కడ టికెట్ ధర ఎంత అనేది వీఎంఆర్‌డీఏ కమిషనరే నిర్ణయిస్తారని ఈ పనులు పర్యవేక్షిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బలరామరాజు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో ట్రయల్ రన్ నడిపి, దసరా నుంచి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు.

చెక్కపై గాంధీజీ రూపం


సూక్ష్మకళాకారుడు దార్ల రవి చెక్కతో రూపొందించిన గాంధీజీ రూపం

నక్కపల్లి, అక్టోబరు 1: మండలంలోని చినదొడ్డిగొల్లు గ్రామానికి చెందిన సూక్ష్మకళాకారుడు దార్ల రవి ప్రత్యేక సందర్భాల్లో తన కళా నైపుణ్యతను ప్రదర్శించి అద్భుత కళాఖండాలను తయారు చేస్తున్నాడు. తాజాగా అక్టోబరు రెండో తేదీ గాంధీ జయంతి సందర్భంగా చెక్కపై గాంధీజీ రూపంతో పాటు రెండో తేదీని అంకె రూపంలో చక్కగా చెక్కాడు.

పకడ్బందీగా టెట్

» కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (టెట్)ను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. టెట్ నిర్వహణపై మంగళవారం ఆమె వెబెక్స్ ద్వారా సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. అక్టోబరు 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అనకాపల్లిలోని ఒక కేంద్రంలో టెట్ నిర్వహిస్తామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక పరీక్ష, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో పరీక్ష జరుగుతాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షకు డిపార్టుమెంట్ అధికారిగా పరవాడ ఎంఈవో సాయిశైలజను నియమించామన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించాలని పోలీసు అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఈపీడీసీఎల్ అధికారులకు చెప్పారు. డీఈఓ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు వుంటే 9441238141, 9490462025, 9177042789 నంబర్లకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో కలెక్టర్

సబ్బవరం, అక్టోబరు 1: మండలంలోని అమృతపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొంతమంది లబ్ధిదారులకు ఆమె పింఛన్ డబ్బులు అందించారు. సాయంత్రంలోగా ప్రతి ఒక్కరికీ పింఛన్ సొమ్ములు పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ, మండలంలో 8,183 మంది పింఛన్‌దారులు సాయంత్రానికి 8053 (98.34 శాతం) మందికి అందజేసి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచామచి చెప్పారు. అందుబాటులోలేని 130 మందికి బుధవారం పింఛన్ డబ్బులు అందజేస్తామని చెప్పారు.

రైతులకు అండగా ప్రభుత్వం

సబ్బవరం, అక్టోబరు 1: రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, నాణ్యమైన పంటలు పండించి, అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. మండలంలో వ్యవసాయ సిబ్బంది చేపట్టిన ఇ-క్రాప్ నమోదును మంగళవారం తవ్వానిపాలెంలో ఆమె పరిశీలించారు. పంటలు సాగు చేసే రైతులంతా విధిగా ఇ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాల లభ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు, అనకాపల్లి ఏడీ ఎం.రామారావు, ఏవో పోతల సత్యనారాయణ, ఏఈవో బాలరాజు, సర్పంచ్ బోకం స్వామినాయుడు, డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు, ఆర్ఐ వీరయ్య వున్నారు.

చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా వెంకటేశ్వరరావు


వెంకటేశ్వరరావు

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 1: ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నర్సీపట్నానికి చెందిన మాసిన వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ప్రతినిధుల పర్యవేక్షణలో నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెస్ క్రీడాభివృద్ధిపై దృష్టి సారిస్తానని అన్నారు.

హోంగార్డు కుటుంబానికి పోలీస్ శాఖ బాసట


నియామక పత్రాన్ని అందిస్తున్న ఎస్పీ

తుమ్మపాల, అక్టోబరు 1: స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన హోంగార్డు పైలా అప్పలనాయుడు కుటుంబానికి పోలీస్ శాఖ బాసటగా నిలిచింది. కారుణ్య నియామకం కింద అప్పలనాయుడు కుమారుడు శ్రీనివాస్‌కు హోంగార్డుగా ఉద్యోగం ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం నియామక పత్రాన్ని జిల్లా ఎస్పీ ఎం.దీపిక అందజేశారు.

పల్లాను కలిసిన కార్పొరేషన్ చైర్మన్లు


పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న తాతయ్యబాబు, పీలా గోవింద

బుచ్చెయ్యపేట, అక్టోబరు 1 : రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ పల్లాను శాలువాలు కప్పి, గజమాలతో సత్కరించారు.

రాష్ట్ర స్థాయి గుర్రాల పోటీలో విజేత కోటనందూరు రాకీ

నాతవరం, అక్టోబరు 1: నాతవరం మండలం డియ్యవరంలో నల్లకొండమ్మ తల్లి జాతరను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి గుర్రాల పోటీల్లో కాకినాడ జిల్లా కోటనందూరుకు చెందిన రాకీ ప్రథమస్థానం సాధించి విజేతగా నిలిచారు. అలాగే రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం వైజాగ్ మణి, తృతీయస్థానం పెద్దాపురం గుర్రాల శ్రీనుకు లభించాయి. ప్రథమ స్థానానికి రూ.15 వేలు, ద్వితీయ స్థానానికి రూ.12 వేలు, తృతీయస్థానానికి రూ.10 వేల చొప్పున ఉత్సవ కమిటీ నిర్వాహకులు బెన్నయ్యనాయుడు అందజేశారు. ఈ గుర్రాల పరుగు పోటీలను నర్సీపట్నం కౌన్సిలర్ చింతకాయల రాజేష్ స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. నల్లకొండమ్మతల్లి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



నయ్యర్‌కు అరకు కాఫీ పొడి బహూకరిస్తున్న పీవో అభిషేక్

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ కార్యదర్శికి అరకు కాఫీ పొడి

పాడేరు రూరల్, అక్టోబరు 1: కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల శాఖ కార్యదర్శి విభు నయ్యర్‌కు పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అరకు కాఫీ పొడిని బహూకరించారు. జార్ఖండ్ రాష్ట్రంలోని హజారీబాగ్‌లో మంగళవారం నయ్యర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన అరకు కాఫీ పొడిని అందించారు. ఈ సందర్భంగా పాడేరు ఐటీడీఏ పరిధిలో జన్‌మన్ కార్యక్రమంలో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించారు. గిరిజనాభివృద్ధికి మరిన్ని నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయాలని పీవో కోరారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



లోచలిపుట్టు పాఠశాలలో యోగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పాడేరు రూరల్, అక్టోబరు 1: నిత్య యోగా సాధనతో విద్యార్థులలో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రణవ సంకల్పయోగ సమితి వ్యవస్థాపకులు, ఇండియన్ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పతంజలి శ్రీనివాస్ అన్నారు. స్థానిక గిరిజన సంక్షే బాలురు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మంగళశారం యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని 117 ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో ఈ ప్రాజెక్టు కొనసాగుతుందన్నారు. ఇందులో పిల్లల ఎదుగుదలకు ఆసనాలు, సూర్య నమస్కారాలు, ఏకాగ్రతకు జ్ఞాపకశక్తి ప్రాణయమాలు, ధ్యానం తదితర అంశాలతో శిక్షణ కొనసాగుతుందన్నారు. పాఠశాలలో 440 మంది విద్యార్థులు 108 పర్యాయంలో సూర్యనమస్కారాలు పూర్తిచేశారన్నారు. 117 ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో 40 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే మండలంలోని తలారిసింగి బాలుర, శ్రీకృష్ణాపురం, గుత్తులపుట్టు బాలికల పాఠశాలల్లో శిక్షణ పూర్తయిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జీవీ.ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్, యోగా శిక్షకులు హరిప్రసాద్

భవన నిర్మాణ కార్మికుల ర్యాలీ



అరకు ప్రధాన రహదారిలో ర్యాలీ చేస్తున్న కార్మికులు

అరకులోయ, అక్టోబరు 1: మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వర కల్యాణ మండపంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణకార్మికులకు తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. కార్మికులకు 12 రకాల సంక్షేమ పథకాలు అందకుండా జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని వాపోయారు. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీ, సమావేశంలో అధిక సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సీలేరులో ముందస్తు దసరా వేడుకలు



వివిధ వేషధారణల్లో డీఏవీ పాఠశాల విద్యార్థులు

సీలేరు, అక్టోబరు 1: సీలేరు డీఏవీ పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన అమ్మవారి దశావతారాలు అందరినీ ఎంతగానో అలరించాయి. అలాగే గాంధీ జయంతి పురస్కరించుకుని వివిధ జాతీయ నాయకులను స్మరిస్తూ మహాత్మాగాంధీ వేషధారణను పలువురు విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమానికి తల్లిదండ్రులు హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ గరగ అలంకరణ

సీలేరులో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మంగళవారం అమ్మవారి గరగ అలంకరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రెగ్యులేటర్ డ్యాం వద్ద దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. అలాగే అమ్మవారికి గరగలను అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం దుర్గాదేవి శరన్నవరాత్రులు నిర్వహించే మండపం వద్దకు తీసుకొచ్చి అమ్మవారి సన్నిధిలో ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంతో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

జర్రెల పీహెచ్‌సీకి పరుపులు వితరణ



పీహెచ్‌సీలో బెడ్స్ సమకూర్చిన రామకృష్ణ

గూడెంకొత్తవీధి: జర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోచలి రామకృష్ణ పరుపులు విరాళంగా అందజేశారు. మంగళవారం పీహెచ్‌సీని సందర్శించిన గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అలాగే పీహెచ్‌సీలో రోగులు పడుకునేందుకు పరుపులు లేకపోవడంతో ఆరు పరుపులను రామకృష్ణ సొంత నిధులతో కొనుగోలు చేసి నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ముర్ల వెంకటరమణ, గ్రామ పెద్ద విష్ణుమూర్తి పాల్గొన్నారు.

పింఛనుదారుల ఆనందమే చంద్రబాబు లక్ష్యం

టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్

అనంతగిరి, అక్టోబర్ 1: పింఛనుదారుల కళ్లల్లో ఆనందమే సీఎం చంద్రబాబు లక్ష్యమని టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ కేంద్రంలో మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులను నేరుగా కలిసి పింఛను డబ్బులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రమంతా అప్పుల్లో కూరుపోయిందని, ఆర్థిక పరిస్థితి బాగులేనప్పటికీ అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే పింఛన్‌దారుల కళ్లల్లో ఆనందాన్ని చూసుకుని సీఎం చంద్రబాబు సంతృప్తి చెందుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వంతో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని ప్రజలే చెప్పుకుంటున్నారన్నారు.



అనంతగిరి: కొత్తూరులో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న శ్రావణ్‌కుమార్



పాడేరు మండలం లగిశపల్లిలో పింఛన్ అందిస్తున్న గిడ్డి ఈశ్వరి

అనంతరం కొత్తూరు కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీతయ్య, వైస్ సర్పంచ్ గాలి నరేంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, నాయకులు ఎం.జోగులు, వి.శివ, బి.లక్ష్మణ్‌రావు, డి.శ్యామ్, పి.జగన్‌బాబు, డి.నాగేశ్వరరావు, సుందరరావు, వరలక్ష్మి, మహిళా పోలీసు లావణ్య పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ఎన్టీఆర్ పింఛను భరోసాను సచివాలయ సిబ్బందితో కలసి టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను గిరిజనులకు వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వంతోనే గిరిజనులకు భరోసా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గీత పాల్గొన్నారు.

శ్రమదానంతో కార్యాలయాల పరిశుభ్రం

పాడేరు రూరల్, అక్టోబరు 1: కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం అధికారులు, ఉద్యోగులు శ్రమదానం నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ డాక్టర్.అభిషేక్‌గౌడ్ సిబ్బందితో పాల్గొని కలెక్టరేట్ పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యాలయ ప్రాంగణంలో ఉన్న చెత్తాచెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకున్నట్లే కార్యాలయం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో బి.పద్మావతి, సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాడేరు కలెక్టరేట్, చింతపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద శుభ్రం చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

ఐటీడీఏ కార్యాలయంలో...

ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవోలు వీఎస్.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు చెత్తాచెదారాలను తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో ఎం.హేమలత, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్.కుమార్, ఇన్‌చార్జి గిరిజన సంక్షేమాధికారి ఎల్.రజని, స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బి.కల్యాణి పాల్గొన్నారు.

అనంతగిరిలో...

అనంతగిరి: మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంటుకుంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో డీటీ మాణిక్యం, ఎంపీడీవో నగేష్, ఏవో లక్ష్మీనారాయణ, ఏపీవో సన్యాసినాయుడు, ఆర్‌ఐ శంకరరావు, కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధిలో...

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం అధికారులు శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ పాపారావు, ఉద్యోగులతో పాటు కార్యాలయం ఆవరణలో జంగిల్ తొలగించారు. గూడెం మార్గంలోని గుంతలలో పేరుకుపోయిన బురద నీటిని తొలగించారు.

చింతపల్లిలో...

చింతపల్లి: ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు శ్రమదానంతో పరిసరాలను శుభ్రం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ టి.రామకృష్ణ, ఉద్యోగులు, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో డీఈఈ రాజు, ఇంజనీరింగ్ అధికారులు కార్యాలయం పరిసరాలను పరిశుభ్రం చేసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి నెలా కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

పాడేరు రూరల్, అక్టోబరు 1: ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు హాజరవుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్ పంపిణీ చేశారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని స్టడీ మెటీరియల్ సమకూర్చిన ఫౌండేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు చక్కగా చదివి మెరిట్ స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి డి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు వన్నెపూరి భీమ్‌నాయుడు, కేజె.రామారావు, కొండబాబు, ప్రసాదరావు, దిలీప్ కుమార్, కేశవరావు, కేశవ, కన్నయ్య, రాజేష్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలానికి అనుగుణంగా పంటల సాగు

ముంచంగిపుట్టు, అక్టోబరు 1: కాలానికి అనుగుణంగా పలు రకాల పంటలను సాగు చేయాలని ఏవో శ్రీనివాసబాబు చెప్పారు. దారెల, బాబుసాల పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక చదరపు మీటరు విస్తీర్ణంలో ఉండాల్సిన మొక్కల సాంద్రతపై పంట పొలంలో కొలతలు వేసి రైతులకు అవగాహన కల్పించారు. లాభదాయకమైన పంటల సాగుపై, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, కాఫీ మిర్యాల తోటల పెంపకం, వాటి లాభదాయకాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పి.పాండురంగస్వామి, ఎం.బంగారమ్మ, రైతులు, పాల్గొన్నారు.

అనవసరంగా బయట తిరిగితే కేసులు

ముంచంగిపుట్టు, అక్టోబరు 1: మండలంలో రాత్రి 11 గంటలు దాటిన తరువాత అనవసరంగా బయట సంచరిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ కె.రవీంద్ర హెచ్చరించారు. దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని చెప్పారు. రాత్రి 11 గంటలు దాటిన తరువాత అనవసరంగా పట్టుబడితే వాహన దొంగతనాల కేసులు నమోదు చేస్తామన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం

» గోరపూర్ ప్రధాన రహదారిపై పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం



రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం

డుంబ్రిగుడ, అక్టోబరు 1: మండలంలోని ఆంధ్ర, ఒడిశా సరిహద్దు గోరపూర్ రైల్వే స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై మంగళవారం ఉదయం ఓ భారీ వృక్షం విరిగి పడింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నానిపోవడంతో నేలమట్టమైంది. ఇది ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. కాగా రోడ్డుకు అడ్డంగా భారీ వృక్షం పడిపోవడంతో సుమారు గంటన్నర సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక గ్రామస్థులతో పాటు వాహనదారులు చెట్టుకొమ్మలను తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. చెట్టు విరిగిపడే సమయానికి ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

కృషి చేస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు, కిశోర బాలికల సమగ్ర పోషణ, పరిరక్షణకు వీలుగా సక్షం పేరిట అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకీకరిస్తున్నామన్నారు. రీజియన్‌లో తొలి విడతగా 280 కేంద్రాలను సక్షం అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దామన్నారు. మూడు వేలకు పైగా ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామన్నారు. అనంతరం 12 మంది గర్భిణులకు సీమంతం చేశారు. ఆమె వెంట సీడీపీవో విజయకుమారి వున్నారు.



రిలే నిరాహార దీక్షల్లో కూర్చొన్న విద్యార్థి సంఘాలు

స్టీల్‌ప్లాంటును ప్రైవేటుపరం చేయొద్దని దీక్షలు

పాడేరు రూరల్, అక్టోబరు 1: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటు పరం చేయవద్దని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాలు మంగళవారం జిల్లా కేంద్రం పాడేరులో రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) రాష్ట్ర మాజీ నాయకులు కూడా రాధాకృష్ణ ఈ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగం చేసి సంపాదించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. ప్రస్తుతం 18 వేల మంది పర్మినెంట్, 20 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులతో రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశ్రమగా స్టీల్‌ప్లాంట్ ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరు మార్చుకొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను విరమించుకోవాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి అభివృద్ధి చేయాలని, గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు చిన్నారావు, లక్ష్మణ్, జీవన్, కార్తీక్, తనీష్, సింహాద్రి, కృష్ణారావు పాల్గొన్నారు.



తలారిసింగి ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఇళ్లకు వెళ్లే విద్యార్థుల హడావుడి

ఇంటికి పోదాం చలో చలో...

» దసరా సెలవులతో విద్యార్థులు ఇంటి బాట

విద్యాలయాలకు దసరా సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఇంటి బాటపడుతున్నారు. అక్టోబరు 3 నుంచి 13వ తేదీ వరకు ప్రభుత్వం పండగ సెలవులను ప్రకటించింది. అయితే బుధవారం గాంధీ జయంతి సెలవు కావడంతో మంగళవారం నుంచే విద్యార్థులు ఇళ్లకు బయలుదేరిపోయారు. మంగళవారం పిల్లలను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకుని వెళుతున్న హడావుడి దృశ్యాలే పట్టణంలో దర్శనమిచ్చాయి. దీంతో జిల్లా కేంద్రం పాడేరులో సందడి వాతావరణం నెలకొంది.

-పాడేరు/ఆంధ్రజ్యోతి



శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాల ప్రవేశ ద్వారం వేచివున్న తల్లిదండ్రులు

☛ సంక్షిప్తంగా..

నాణ్యమైన కాఫీ దిగుబడులకు కృషిచేయాలి

» కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు ప్రభాకరరావు

చింతపల్లి, అక్టోబరు 1: గిరిజన రైతులు నాణ్యమైన కాఫీ దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకరరావు అన్నారు. కేంద్ర కాఫీ బోర్డు కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ కాఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ నాణ్యమైన కాఫీ ఉత్పత్తి చేస్తే మంచి ధర పొందవచ్చన్నారు. జేఎల్‌వో ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ గిరిజన రైతులు కాఫీ సాగులో మెలకవలు పాటిస్తూ అంతర్జాతీయ ధరలు అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టు ఏడీ అశోక్, కాఫీ బోర్డు విస్తరణ తనిఖీ అధికారులు శశి ప్రియ, మోహన్ పాల్గొన్నారు.

కాఫీ తోటలతో మంచి ఆదాయం

అరకులోయ: గిరి రైతులకు కాఫీ తోటలు ఆదాయ వనరుగా మారాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్ అన్నారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన కాఫీ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎకరం కాఫీ తోట నుంచి ఏడాదికి సుమారు రూ.లక్ష ఆదాయం లభిస్తుందన్నారు. బోటనీ అధ్యాపకుడు లచ్చన్న మాట్లాడుతూ ఆదివాసీ కుటుంబాలు 2.58 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు సాగు చేస్తున్నట్టు చెప్పారు. కళాశాల ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించే పనులను విద్యార్థులు చేపట్టారు. ఈ కార్యక్రమంలలో ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు విజయలక్ష్మి, అనిత కుమారి, నాగబాబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మన్యంలో వాణిజ్య పంటగా కాఫీ

గూడెంకొత్తవీధి, అక్టోబరు 1: మన్యంలో ఆదివాసీ రైతులు ప్రధాన వాణిజ్య పంటగా కాఫీని సాగు చేస్తున్నారని ఆర్‌వీ నగర్ రీజనల్ కాఫీ పరిశోధన కేంద్రం ఆఫీస్ ఇన్‌చార్జి, శాస్త్రవేత్త డి.సునీల్‌బాబు అన్నారు. పరిశోధన స్థానంలో మంగళవారం నిర్వహించిన కాఫీ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ రైతులకు పరిశోధనలు నిర్వహించి మేలుజాతి విత్తనాలను అందిస్తున్నామని చెప్పారు గిరిజన ప్రాంత రైతులు పండించిన కాఫీ రుచులు ఆస్వాదించేందుకు ప్రపంచ దేశ కాఫీ ప్రియులు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భూసార విభాగం శాస్త్రవేత్త డాక్టర్ రాజిబ్‌పతి, జేఎల్‌వో శ్రీనివాసరావు, ఈఎంఆర్, శాంతిసాధన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలకు దూరం కండి'

పాడేరు రూరల్, అక్టోబరు 1: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డాక్టర్ టీఎస్‌ఎన్.రాజు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలు వినియోగిస్తే కలిగే నష్టాలు, గంజాయి నివారణకు చేపట్టాల్సిన అంశాలపై మంగళవారం ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి స్పందించారు. ముందుగా కళాశాల విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. యువత మత్తు పదార్థాలు తాగడం వల్ల జరిగే శారీరక, మానసిక మార్పులు, నష్టాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, ఐక్యూఎస్సీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు వి.రమేష్‌బాబు, డి.గణేష్, జి.దామోదర్, జి.గౌరీశంకరరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర అభివృద్ధికి యువత కృషి

పాడేరు రూరల్, అక్టోబరు 1: స్వర్ణాంధ్ర-2047 అభివృద్ధికి యువత కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి కోరారు. మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, గ్రూపు డిస్కషన్ పోటీలతో పాటు ప్లాస్టిక్ నివారణ, పరిసరాల పరిశుభ్రత, వనసంరక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే తరగతి గదులు, గ్రంథాలయ, లాబ్‌రూమ్‌లను పరిశుభ్రం చేశారు. అనంతరం ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఆలయానికి చేరుకున్న 50 మంది కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు (విద్యార్థులు) అక్కడ పరిసరాలను శుభ్రం చేసి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, ఐక్యూఎస్సీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు వి.రమేష్‌బాబు, డి.గణేష్, జి.దామోదర్, జి.గౌరీశంకరరావు, అధ్యాపకులు మురళీధరరావు, అప్పలనాయుడు, కొత్తంనాయుడు పాల్గొన్నారు.

ఇళ్లకే రేషన్ సరకులు ఇవ్వండి

చింతపల్లి, అక్టోబరు 1: లబ్ధిదారుల గృహాల వద్దకు ఎండీయూ ఆపరేటర్లు వెళ్లి రేషన్ సరకులు ఇవ్వాలని తహసీల్దార్ టి.రామకృష్ణ ఆదేశించారు. దోమలగొంది గ్రామంలో మంగళవారం రేషన్ పంపిణీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు కచ్చితమైన తూకానికి బియ్యం అందజేయాలన్నారు. అలాగే పంచదార, గోధుమ పిండి కూడా ఇవ్వాలన్నారు. సరకులు పూర్తి స్థాయిలో అందకపోతే రెవెన్యూ కార్యాలయానికి లబ్ధిదారులు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

కొయ్యూరులో భారీ వర్షం



నడింపాలెం కురుస్తున్న వర్షం

కొయ్యూరు, అక్టోబరు 1: మండల వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భానుడు ప్రతాపాన్ని చూపడంతో మండల వాసులు అల్లాడిపోయారు. అనంతరం వాతావరణంలో అనూహ్యంగా మార్పులు వచ్చి ఉరుములు, మెరుపులతో కుండపోత వాన పడింది. దీంతో వారంతా వేడి నుంచి ఉపశమనం పొందారు. కాగా భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు పొంగి ప్రవహించాయి. పలు ప్రాంతాల్లో వరి పైరు నీట మునిగింది. రెండు గంటల పాటు వర్ష ప్రభావంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది.

ఎలక్ట్రీషియన్ల మండల కార్యవర్గం

పెదబయలు, అక్టోబరు 1: ఎలక్ట్రీషియన్ల మండల కార్యవర్గాన్ని యూనియన్ అధ్యక్షుడు కిల్లు క్రిష్ణబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా లకే చిట్టిబాబు, ఉపాధ్యక్షుడిగా చెట్టి గోవర్ధన్, కార్యదర్శులుగా గోవింద్ ప్రసాద్‌పడాల్, సత్యనారాయణనాయుడు, కోశాధికారిగా కొర్ర భూషణరావులను ఎన్నుకున్నారు. సభ్యుల నిర్ణయాలను అనుగుణంగా ముందుకు సాగేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు చెప్పారు.